దోస రైతులకు నిరాశే..

ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తున్న రైతన్నల పరిస్థితి దారుణంగా తయారవుతోంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పంటల సాగు చేస్తున్నారు. కూలీల ఖర్చులు, రసాయన మందుల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. కాలం కలసిరాక, వాతావరణం మార్పు, వైరస్‌ల దెబ్బకు ఆశించిన దిగుబడులు రావడం లేదు. రైతులు పంట తొలగించక పొలాల్లోనే వదిలేస్తున్నారు. సాగు కోసం చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నారు.

- నష్టాలు మిగిల్చిన ఢిల్లీ రకం దోస
- వాతావరణం మార్పు, వైరస్‌తో పెరగని కాయల సైజు
- ఎకరా పంట సాగుకు రూ.లక్ష వరకూ ఖర్చు
- పెట్టుబడి కూడా అందని పరిస్థితి
- నష్టాలపాలవుతున్న రైతన్నలు




యర్రంపల్లి సమీపం, దామాజిపల్లి వద్ద ఢిల్లీ రకం దోస పంటను తొలగించకుండా వదిలేసిన దృశ్యం

చెన్నేకొత్తపల్లి: సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి.. వాణిజ్య పంటలు సాగు చేసి లాభాలు పొందాలనుకున్న రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. మంచి దిగుబడి వస్తే అప్పులన్నీ తీర్చుకోవచ్చని సాగుకు శ్రీకారం చుడుతున్నారు. తీరా పంటలు పండక చేసిన అప్పులు పెరిగిపోతుండటంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారు. ఇటీవల మండలంలో చాలా మంది రైతులు దోస, కర్బూజా, ఢిల్లీ రకం దోస సాగు చేశారు. ఢిల్లీ రకం దోస పంటను ఎకరా విస్తీర్ణంలో సాగు చేసేందుకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. నాణ్యమైన విత్తనాల కోసం కిలో రూ.70 వేల నుంచి 80 వేల వరకూ ఖర్చు పెట్టాలి. వీటిని సాగు చేసేందుకు మల్చింగ్ షీట్, పంట ఎదుగుదల, కాయల పరిమాణం పెరిగేందుకు రసాయన మందులు, కూలీల ఖర్చులన్నీ భరించాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఢిల్లీ రకం దోస పంటను మండల వ్యాప్తంగా దాదాపు 250 నుంచి 300 ఎకరాల్లో సాగు చేసినట్లు సమాచారం. పంట సాగు చేసిన కొన్ని రోజుల వరకూ పంట ఎదుగుదల ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఉన్నపళంగా పంట ఎదుగుదల ఆగిపోయింది. వాతావరణంలో మార్పు రావడం, వైరస్ సోకడంతో కాయల సైజు పూర్తిగా తగ్గిపోయింది. కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలో ఆశించిన దిగుబడులు కూడా రాలేదు. పంట తొలగించేందుకు మళ్లీ కూలి ఖర్చులు భరించలేక రైతులు పంటను పొలాల్లోనే వదిలేస్తున్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడి తిరిగి రాలేదని చెబుతున్నారు. నీటి వసతి పుష్కలంగా ఉన్నప్పటికీ.. పంటలు చేతికి రాకపోవడంతో ఏమి చేయలేని స్థితిలో ఉన్నామంటున్నారు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని.. వాటిని ఎలా తీర్చాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అప్పు చేసి సాగు చేశా..

ఢిల్లీ రకం దోస సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయనే ఆశతో అప్పులు చేసి మరీ పంట పెట్టాను. వేసవి ప్రారంభానికి పంట కోతదశకు వస్తుందని భావించాను. అయితే పంట సాగు చేసిన అనంతరం వాతావరణంలో మార్పులు వచ్చాయి. చలి ఎక్కువ కావడంతో పంటకు వైరస్ సోకింది. పంట మొత్తం దెబ్బతింది. పంటను తొలగించక పొలంలోనే వదిలేశాను.

– నాగరాజు, రైతు, చెన్నేకొత్తపల్లి

చలికి కాయల సైజు తగ్గుతోంది

ఇటీవల మండలంలో వివిధ గ్రామాల రైతులు వాణిజ్య పంటలు సాగు చేశారు. చలి కారణంగా దోస కాయల సైజు తగ్గుతోంది. ఆశించిన దిగుబడులు కూడా రావడం లేదు. రైతులు పంట రాలేదని లేనిపోని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యాన పంటల సాగులో రైతులు అధికారుల సూచనలు పాటించాలి.

– రాంప్రసాద్, ఇన్‌చార్జ్ మండల ఉద్యానశాఖ అధికారి, చెన్నేకొత్తపల్లి

హిందువులు ఐకమత్యంగా ఉండాలి



పూజలు చేస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామీజీ

ధర్మవరం అర్బన్: హిందువులు ఐకమత్యంగా ఉండాలని మైసూరు దత్తపీఠం ఉత్తర పీఠాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీ పిలుపునిచ్చారు. పట్టణంలోని కొత్తపేటలోనున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలకు స్వామీజీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, దత్తస్వామి, పద్మావతి అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ దైవ సంకల్పం అందరికీ ఉండాలన్నారు. హిందూ దేవాలయాలపై దాడులు జరగడం బాధాకరమన్నారు. హిందువులందరూ ఆలయాలకు రక్షణగా ఉంటూ సేవలందించాలని సూచించారు. ప్రతి హిందువూ ప్రశ్నించే తత్వం ఉన్నప్పుడే దేవాలయాలకు రక్షణ ఉంటుందన్నారు. పాత, జీర్ణోద్ధరణ ఆలయాలు, పురాతన ఆలయాలను కాపాడుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అన్ని పుణ్యక్షేత్రాల్లో అన్య మతస్తులు ఉద్యోగులుగా ఉండటం సబబు కాదని, భక్తి ఉన్నవారే అక్కడ ఉద్యోగం చేస్తూ సేవలందించాలని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు స్వామీజీని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మెటికల బాల, శంకరప్ప, శాగా శ్రీనివాసులు, మెటికల కుళ్లాయప్ప, దత్త శివ, శంకర సంజీవులు, బిల్లే నాగప్ప, గుద్దిటి రామాంజనేయులు, శాగా సురేష్ పాల్గొన్నారు.

కోదండ రామాలయం ప్రారంభోత్సవం



సీతారామ లక్ష్మణ, హనుమ విగ్రహాలు



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న గ్రామపెద్దలు

ఓడీచెరువు : చౌడంపల్లిలో గ్రామస్తుల సహకారంతో నిర్మాణం పూర్తయిన శ్రీ కోదండ రామాలయ ప్రారంభోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో సీతారామ లక్ష్మణ, హనుమ విగ్రహాల ప్రతిష్ట, పూర్ణాహుతి, మహామంగళ హారతి కార్యక్రమాలను పురోహితులు పంచరత్న సురేష్ శర్మ, హర్షవర్ధన్‌స్వామి, మహేష్ స్వామి, తేజస్వామి ఘనంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఆలయ పరిసరాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదానం నిర్వహించారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగులకు చెక్



ధర్మవరం మండలం గొట్లూరులో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్



ముదిగుబ్బలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న దృశ్యం

సాక్షి బృందం: ఆల్బెండజోల్ మాత్రలతో కడుపులోని నులి పురుగులను నివారించవచ్చని వైద్యాధికారులు తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం సోమవారం ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులతో పాటు 0–19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు, డాక్టర్లు, హెచ్‌ఈలు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, విద్యాశాఖ అధికారులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొని మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యాధికారులు, విద్యాశాఖ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పిల్లలు పెరిగిన గోళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలని సూచించారు. శుభ్రమైన నీరు తాగాలని, మూత కప్పి ఉంచిన ఆహారాన్నే తినాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, బహిరంగ ప్రదేశాలల్లో మల విసర్జన చేయకుండా మరుగుదొడ్లు ఉపయోగించాలని సూచించారు. ధర్మవరం మండలం గొట్లూరు ప్రభుత్వ పాఠశాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సాల్మన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పుట్టపర్తి పరిధిలోని ఎనుములపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చేతుల మీదుగా మాత్రలు వేశారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ముదిగుబ్బ: మల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రోడ్డు భద్రత నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ శ్యామరావు హాజరై విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలు తదితర వాటి గురించి వివరించారు.

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీఎస్‌ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఆర్టీఓ శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత, ఎంవీఐ వరప్రసాద్ హాజరై రహదారి భద్రత నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సంక్షిప్త సమాచారం

విద్యుత్ వేళల్లో మార్పులు

తలుపుల : మండలంలో వ్యవసాయ మోటార్లకు సరఫరా అయ్యే విద్యుత్ వేళలు మంగళవారం నుంచి మార్పునున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శివతేజ ఓ ప్రకటనలో తెలిపారు. పగటి పూట 9 గంటల విద్యుత్ సరఫరాలో ఓబీఆర్ ఫీడర్‌కు ఉదయం 6 నుంచి11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు, వేపమానిపేట ఫీడర్‌కు ఉదయం 4 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు సరఫరా అవుతుందని ప్రకటించారు.

చీనీకి పులుసు పురుగు, గ్రీనింగ్ తెగులు



చీనీ తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తాడిమర్రి: ఏకపాదంపల్లిలోని చీనీ తోటలను సోమవారం రేకులకుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. చీనీ తోటకు పులుసు పురుగు, గ్రీనింగ్ అనే తెగులు ఆశించినట్లు శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్ గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగులను నివారించడానికి పురుగు మందును పిచికారీ చేయడమే కాక పసుపు రంగు, జిగురు అట్టలను అమర్చాలన్నారు. పులుపు పురుగు నివారణ కోసం ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీలు లేదా థయామెథోక్సం 0.3 గ్రాములు లీటర్ నీటిలో కలిపి కొమ్మలు, మొదళ్ల పై భాగం వరకు తడిచేలాగా పిచికారీ చేసుకోవాలన్నారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిపై మరమ్మతులు



రోడ్డు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పోతుకుంట రైల్వే ఓవర్ బ్రిడ్జిపై పడిన గతుకులకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. గత నెల 21న 'దడ దడ.. గుండె దడ' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు సోమవారం స్పందించారు. గతుకులను పూడ్చి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

రామాలయానికి విరాళం

పుట్టపర్తి అర్బన్: సుబ్బరాయనిపల్లిలో నిర్మితమవుతున్న రామాలయానికి గ్రామానికి చెందిన లింగా రామమోహన్ రూ.50 వేల విరాళం అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.

ప్రేమ విఫలమే కారణం

- ల్యాబ్ టెక్నిషియన్ ఆత్మహత్య కేసులో వీడిన మిస్టరీ

రాప్తాడు రూరల్: అనంతపురం నగర శివారున నేషనల్ పార్క్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన అభిలాష్ (28)ది ఆత్మహత్యనే అని పోలీసులు నిర్ధారించారు. ఆదివారం సాయంత్రం అభిలాష్ మృతదేహాన్ని గుర్తించినా... ఆ ప్రాంతం ఎవరి పరిధిలోకి వస్తుందనే స్పష్టత కోసం త్రీటౌన్, ఫోర్త్‌టౌన్, రూరల్ పోలీసులు మల్లగుల్లాలు పడిన విషయం తెలిసిందే. సాయంత్రం సమయంలోనే మృతదేహాన్ని గుర్తించినా ఎవరికి వారు తమ పరిధి కాదంటే తమపరిధి కాదని మిన్నకుండిపోయారు. అభిలాష్ శరీరంపై కాలిన గాయాలు ఉండడంతో మృతిపై అనుమానాలు రేకెత్తాయి. మృతదేహం లభ్యమైన ప్రాంతంపై ఎట్టకేలకు సోమవారం స్పష్టత వచ్చింది. కాగా, కదిరి మండలం నడింపల్లికి చెందిన మహేంద్ర అనంతపురం సాయినగర్‌లో చిన్న హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. మహేంద్ర దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో అభిలాష్ పెద్దకుమారుడు. గతంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషయన్‌గా పని చేసిన అభిలాష్ తర్వాత కొద్దిరోజులు కియా కంపెనీలో పని చేశాడు. ప్రస్తుతం ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్‌లో పని చేస్తున్నాడు. తాను ప్రేమించిన అమ్మాయి మరో యువకుడితో వివాహానికి సిద్ధపడింది. ఈ క్రమంలో నిశ్చితార్థం కూడా జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అభిలాష్ పెట్రోలు పోసుకుని నిప్పటించుకున్నాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డాక్టర్ భూమికకు కన్నీటి వీడ్కోలు



కడసారి చూపు చూసేందుకు వచ్చిన బంధుమిత్రులు, ఇన్‌సెట్‌లో డాక్టర్ భూమిక (ఫైల్)

తలుపుల : హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి మేనకోడలు డాక్టర్ నంగి భూమిక (25) అంత్యక్రియలు స్వగ్రామం తలుపుల మండలం నంగివాండ్లపల్లిలో సోమవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. గ్రామస్తులు, బంధుమిత్రులు వందలాది మంది పాల్గొని కడసారి చూపు చూసుకున్నారు. భూమిక తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. భూమిక చనిపోయిన తర్వాత ఆమె అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేసి స్ఫూర్తిగా నిలిచిన విషయం విదితమే.

రోడ్డు ప్రమాదంపై ఫిర్యాదు

ధర్మవరం అర్బన్: పట్టణంలో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంపై బాధితుడు సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. సాయినగర్‌కు చెందిన శివకుమార్ ఈ నెల 8న సాయంత్రం ద్విచక్రవాహనంలో సుదర్శన్ కాంప్లెక్స్ వద్ద వస్తుండగా వెనుక నుంచి వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టి వెళ్లిపోయిందన్నారు. తీవ్రంగా గాయపడిన శివకుమార్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న అనంతరం సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కాశీవిశ్వేశ్వరునికి ప్రత్యేక పూజలు

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని కాశీ విశ్వేశ్వరాయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు చేసి, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే శివమాలధారణ చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

క్లుప్తంగా

ట్రాఫిక్ ఇబ్బందులు కలిగించొద్దు



కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కదిరి టౌన్: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో తోపుడుబండ్ల వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, టాక్సీ డ్రైవర్లకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ వి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎక్కడ పడితే అక్కడ ఆటోలు, ట్యాక్సీలు పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్లు దగ్ధం

ఓడీచెరువు: వీరఓబనపల్లిలో 200 మామిడి చెట్లు దగ్ధమయ్యాయి. సోమవారం మధ్యాహ్నం గడ్డికి రాజుకున్న నిప్పు తోటలను చుట్టుముట్టడంతో డ్రిప్పు, ఇతర వ్యవసాయ పరికరాలు, మామిడి చెట్లు కాలిపోయినట్లు రైతులు రామచంద్ర, బాబు, సూర్యనారాయణ తెలిపారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కదిరి అర్బన్: భవన నిర్మాణ కార్మిక సంఘానికి చెందిన భూమిని అక్రమంగా చేసుకున్న రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రామకృష్ణ, బాబాఫక్రుద్దీన్, శంకర్, మహమ్మద్ అలీ, శ్రీనివాసులు, శీనానాయక్, అబ్దుల్‌మాజిద్ తదితరులు ఉన్నారు.

పేదలందరికీ స్థలాలివ్వాలి

తాడిమర్రి: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నివసించే పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రం తాడిమర్రిలో సోమవారం వారు సీపీఐ, రైతు సంఘం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లులేని నిరుపేదల నుంచి దరఖాస్తులను తీసుకున్నారు. వీటిని తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు బీసాని లక్ష్మీనారాయణ, సన్న పెద్దన్న, చౌడప్ప, బత్తలపల్లి వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యర్శులు సన్న పెద్దన్న, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అప్పగించాలి

కదిరి టౌన్: టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు కదిరి డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో 2018లో హిందూపురం రోడ్డులో గట్లు వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. లబ్ధిదారుల వాటాగా రూ.500, రూ.25 వేలు, రూ.50 వేలు చొప్పున కట్టించుకున్నారు. లబ్ధిదారు వాటా పోను మిగతా మొత్తాన్ని బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేసి కంతులు చెల్లించాలని నోటీసులు అందజేశారని, ఇళ్లు అప్పగించకనే వసూళ్లు చేయడమేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, ముస్తక్, రామ్మోహన్, బాబ్జాన్, అంజనేయులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఆర్‌సీడీఎస్ మండల అధ్యక్షుడిగా గోవర్ధన్‌రెడ్డి

తనకల్లు: రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌సీడీఎస్) తనకల్లు మండల అధ్యక్షుడిగా పి.గోవర్ధన్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి నుంచి నియామక ఉత్తర్వులు సోమవారం జారీ అయ్యాయి. నూతన మండల అధ్యక్షుడు మాట్లాడుతూ రెడ్డి కమ్యూనిటీ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

బాలిక అదృశ్యం

కదిరి టౌన్: పట్టణానికి చెందిన ముస్లిం సామాజిక వర్గానికి చెందిన బాలిక ఈ నెల ఎనిమిదో తేదీ తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లిపోయింది. బాలిక తల్లి సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పదో తరగతి చదువుతున్న బాలిక తన మేనత్త నివాసముండే పుట్టపర్తి మండలానికి అప్పుడప్పుడు వెళ్లేదని పేర్కొంది. బాలిక అదృశ్యానికి సంబంధించి ఆ ప్రాంతానికి చెందిన అబ్బాయిపై అనుమానం వ్యక్తం చేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయండి



అర్జీలతో ధర్నా చేస్తున్న మహిళలు

కదిరి టౌన్: తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని మున్సిపల్ పరిధిలోని పాత అమీన్‌నగర్, న్యూ అమీన్‌నగర్‌కు చెందిన నిరుపేద మహిళలు డిమాండ్ చేశారు. అద్దెలు చెల్లించలేని స్థితిలో ఉన్నామని, తమకు వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ వారు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌అండ్‌బీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణ పరిధిలోని పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంత పేదలకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి.. నిర్మించుకోవడానికి సాయం చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాంబశివ, నారాయణ, మహిళలు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

చెన్నేకొత్తపల్లి: హరియాన్ చెరువులో రైతు కంచికుంట ఆదినారాయణకు చెందిన గడ్డివాముకు ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు పెద్ద ఎత్తున వ్యాపించడంతో గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైరింజన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే మూడు ట్రాక్టర్ల పశుగ్రాసం కాలిపోయింది. రూ.80 వేల వరకూ నష్టం వాటిల్లినట్లు రైతు ఆదినారాయణ తెలిపాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ న్యామద్దెల రామకృష్ణారెడ్డి సోమవారం బాధిత రైతును పరామర్శించారు. ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. తన వంతు సాయంగా రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నరసింహులు, రామాంజి, రామకృష్ణ, నగేష్, ఆంజనేయులు, రాహుల్, శివ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని హరియాన్ చెరువు గ్రామానికి చెందిన కంచికుంట ఆదినారాయణ అనే రైతుకు చెందిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పశుగ్రాసం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోలా రామచంద్రారెడ్డితో పాటు ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులు రైతు ఆదినారాయణను పరామర్శించారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో నరేంద్రరెడ్డి, నగేష్, రామాంజనేయులు, బొగ్గుకిష్ట, మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

కదిరి టౌన్: పట్టణంలోని అడపాలవీధిలో నివాసముంటున్న స్వాతి వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్న కేసులో నిందితుడైన భర్త కేశవయ్యను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరిచారు. నిందితునికి మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించడంతో సబ్ జైలుకు పంపించారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

ఎన్పీకుంట: విద్యాప్రమాణాలు మెరుగుపరచుకోవాలని ఎంపీడీఓ అంజినప్ప కేజీబీవీ ఉపాధ్యాయినులకు సూచించారు. సోమవారం ఆయన కేజీబీవీని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి.. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఇంటర్, పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేక తరగతులు నిర్వహించి వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, ఎస్‌ఓ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిని అద్వికకు ప్రశంసలు



అద్వికను ప్రశంసిస్తున్న ఎంఈఓ

బత్తలపల్లి: జాతీయస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలకు ఎంపికైన బత్తలపల్లి శ్రీ జ్యోతి హైస్కూల్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని అద్వికకు ఎంఈఓ సుధాకర్‌నాయక్, ప్రధానోపాధ్యాయులు మిడతల లక్ష్మీనారాయణ ప్రశంసలు కురిపించారు. ఎంఈఓ మాట్లాడుతూ జాతీయస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మిడతల ధర్మతేజ, ఉపాధ్యాయులు నాగపెద్దిరాజు, శంకరయ్య, కాటమయ్య, రమేష్, ఆదెప్ప, రఫీ, వెంకటపతి, పరశురాం, మధు, లావణ్య, ఉమాదేవి, దీప, లక్ష్మీ, పూజ, సుజా, ధనలక్ష్మీ, గంగాదేవి, ధనలక్ష్మి, సువర్ణ, గీత, తదితరులు పాల్గొన్నారు.